

ధన్వాడ మండలం మందిపల్లిలో పంటను మేస్తున్న గొర్రెలు

## పంటలు పశువుల పాలు

ధన్వాడ, మార్చి 21 : యాసంగిలో పంటలు సాగు చేసిన రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా బోర్లు అడుగంటి పోవడంతో పంటలన్నీ ఎండిపోతున్నాయి. దీంతో చేసేదిలేక రైతులు పంటలను పశువుల మేతకు వదిలేస్తున్నారు. మండలంలోని ఎనోనిపల్లిలో గౌను జయమ్మ రెండు ఎకరాలు, మందిపల్లిలో మాధవరెడ్డి ఎనిమిది ఎకరాల్లో వరి పంట సాగు చేయగా నీరు లేక పోవడంతో పంటంతా ఎండిపోయింది. అదేవిధంగా రామకృష్ణారెడ్డికి చెందిన నాలుగు ఎకరాల వరిపంట కూడా ఎండిపోయి పొలం నెర్రెలు బారడంతో వారు తమ పంటలను గొర్రెలు, మేకలు, పశువుల మేతకు వదిలేశారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే పైసా కూడా చేతికి రావడంతో లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదేండ్ల కిందట ఇలాంటి పరిస్థితి ఉండేదని, మళ్లీ ఇప్పుడు మొదటికొచ్చిందని వాపోతున్నారు. ఎండిన పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## కాంగ్రెస్ వచ్చింది.. కష్టాలు తెచ్చింది..

మూసాపేట, మార్చి 21 : పదేండ్లు ఏటా రెండు పంటలు పండించిన రైతులు కాంగ్రెస్ కాలు పెట్టిన వేళా విశేషమో ఏమో కాని రైతులు పంటలు పండించుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. మండలకేంద్రానికి చెందిన సందుల ఆంజనేయులుకు చెందిన రెండు ఎకరాల పొలాన్ని అచ్చాయపల్లికి చెందిన బాలయ్య కౌలుకు తీసుకొని యాసంగిలో వరి సాగు చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కరెంట్ సరఫరా సక్రమంగా ఇవ్వకపోవడంతోపాటు భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో చేతికందివచ్చిన పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో చేసేది లేక బాలయ్య పంటను పశువుల మేతకు వదిలేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నదని, అందుకే రైతుబంధు విడుదల చేయడం లేదని, వ్యవసాయానికి కరెంట్ కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మూసాపేట మండలంలో ఎండిన వరి పంటను పశువులకు మేపుతున్న రైతు

## రైతుబంధు రాదాయే.. పంట ఎండిపాయే..

భూత్పూర్, మార్చి 21 : రాష్ట్రంలో రైతులు ఎంతో దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. యాసంగిలో సాగు చేసిన పంటలకు నీరు లేక పూర్తిగా ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నర్సింగాపూర్‌కు చెందిన అనుక కృష్ణయ్యకు నాలుగున్నర ఎకరాలు ఉండగా.. రెండెకరాల పొలంలో రూ. 50 వేలు అప్పు తెచ్చి వరి పంటను సాగు చేశాడు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పోవడంతో సాగు చేసిన పంటను కాపాడు కోవడం కష్టంగా మారింది. ఒక వైపు బోరులో నీరు అడుగంటడంతోపాటు కరెంట్ కోతలతో ఎండిన పంటను పశువుల మేత కోసం వదిలేశాడు. అయితే ప్రభుత్వం పెట్టుబడి సాయంగా ఇచ్చే రైతుబంధును కూడా వేయకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం రైతు బంధును వేయడంతోపాటు ఎండిన పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని పలువురు అన్నదాతలు కోరుతున్నారు.



నర్సింగాపూర్‌లో వరి పంటను ఆవులకు మేపుతున్న రైతు కృష్ణయ్య


## ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

మల్దకల్, మార్చి 21 : ఈతకు వెళ్లి విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని ఉల్గెపల్లిలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు గ్రామానికి చెందిన బోయ హుస్సేన్ కుమారుడు వీరేందర్ (13) బిజ్వారం జెడ్పీహెచ్‌ఎస్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. బుధవారం గ్రామంలోని యువకులతో కలిసి సమీపంలోని వ్యవసాయ బావికి ఈత కు వెళ్లాడు. ఈతకు దిగిన వీరేందర్ బావిలోంచి బయటకు రాకపోవడంతో గమనించిన తోటి యు వకులు రాత్రికి గ్రామస్తులకు సమాచారమిచ్చారు. గురువారం ఉదయం గ్రామస్తులు కొందరు బావి లో వెతికి వీరేందర్ మృతదేహాన్ని బయటకు తీసినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపా రు. విద్యార్థి మృతి విషయం తె లుసుకున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉల్గెపల్లి గ్రా మానికి చేరుకొని నివాళులర్పించారు.

## ఏడుగురిపై కేసు

అయిజ, మార్చి 21 : అయిజ పట్టణంలోని తాసీల్దార్ కార్యాలయంలో బుధవారం పెట్రోల్‌తో వచ్చి అలజడి సృష్టించి, విధులకు ఆటంకం కలిగించారనే నెపంతో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌భాస్కర్ తెలిపారు. అయిజకు చెందిన రం గు లక్ష్మీదేవి, సుబద్రమ్మ, రోహిణి, రామేశ్వరమ్మ, గోవిందమ్మతోపాటు మరో ఇద్దరు పురుషులపై తాసీల్దార్ జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

- గద్వాల జిల్లాలో 6.53 మీటర్ల లోతుకు భూగర్భ జలం



గద్వాల జిల్లా లత్తీపురంలో సన్నగా పోస్తున్న బోరు, ఎండిన వరి పంట

- వట్టిపోతున్న వ్యవసాయ బోర్లు
- నీరు అందక ఎండుతున్న ఆరుతడి, వరి పంటలు
- ప్రశ్నార్థకంగా యాసంగి సాగు
- అయోమయంలో అన్నదాతలు

*సాగునీటి ముప్పు ముంచుకొస్తున్నది. వేసవి ప్రారంభంలోనే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. కరువు తాండవం చేస్తుండగా.. భూగర్భ జలాలు క్రమక్రమంగా పాతాళానికి పడిపోతున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో గతేడాది 5.5 మీటర్ల లోతులో జలాలు ఉండగా.. ప్రస్తుతం 6.53 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఇప్పటికే ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులు ఎండిపోగా.. బోరు బావుల్లో నీటిమట్టం వేగంగా తగ్గుతుండడంతో ఆశలు అడుగంటుతున్నాయి. కొందరు రైతులు ఎన్నో ఆశలతో వేసిన ఆరుతడి, వరికి నీళ్లు అందకపోవడంతో పశువులు, గొర్రెల మేతకు వదిలేశారు. దీంతో యాసంగి పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. కోటి ఆశలతో పెట్టుబడులు పెట్టిన రైతన్నలు కంటతడి పెడుతున్నారు.*

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, మార్చి 21

# బోరుమంటున్నారు..

### వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు

గద్వాల, మార్చి 21 : జిల్లాలో పాత రోజులు దాపురించాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువులు, కుంటలు ఎండిపోయాయి. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు నీళ్లలేక అడుగంటాయి. భూగర్భ జలాలు గణనీయంగా తగ్గడంతో బోర్లల్లో నీటిమట్టం పడిపోయింది. వేసిన పంటలకు నీరందక రైతులు ఎండబెడుతున్నారు. కష్టపడి పండించిన పంట కండ్లెదుటే పాడవుతుంటే రైతులు ఆందోళన చెందుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయం, సాగునీటి రంగాలకు ప్రాధాన్యత కల్పించిందని పలువురు రైతులు గుర్తు చేసుకుంటున్నారు. నదులకు వరద వచ్చిన సమయంలో నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లు, చెరువులను నింపేవారని అంటున్నారు. దీంతో ఏడాదికి రెండు, మూడు పంటలు పుష్కలంగా పండేవని పేర్కొన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో సాగుకు గడ్డుకాలం ఏర్పడిందని వాపోతున్నారు. జూరాలకు వరద వచ్చిన సమయంలో చెరువులు, రిజర్వాయర్లు నింపకుండా అధికారులు దిగువకు నీటిని విడుదల చేయడంతో నేడు సాగునీరు పారని దుస్థితి తలెత్తిందని ఆందోళన చెందుతున్నారు. దీంతో యాసంగి పంటల సీజన్ ప్రశ్నార్థకంగా మారింది. ఇటు కృష్ణ, అటు తుంగభద్ర నదులు నీళ్లలేక వట్టిపోవడంతో జోగుళాంబ గద్వాల జిల్లాలో ప్రాజెక్టు కింద కూడా అధికారులు క్రాప్ హాలీడే ప్రకటించారు. ఆర్డీఎస్, తుమ్మిళ్ల ప్రాజెక్టుల ఆయకట్టు కింద ఇదే పరిస్థితి. చాలా కాలం తర్వాత పంటలు లేక.. చేతికి పని లేకుండా కర్షకులకు ఏమి చేయాలో పాలుపోవడం లేదు. చేయూతనివ్వాల్సిన రేవంత్ సర్కారు మాయమాటలు చెబుతూ కాలం వెల్లదీస్తున్నదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### బోర్లల్లో పడిపోతున్న నీటిమట్టం

యాసంగిలో ప్రాజెక్టుల కింద క్రాప్ హాలిడే ప్రకటించగా.. చాలా మంది రైతులు బోర్ల కింద పంటలు సాగు చేశారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా రిజర్వాయర్లు, చెరువులు నీళ్లలేక బోసిపోయాయి. రోజురోజుకూ బోర్లల్లో సైతం నీటిమట్టం గణనీయంగా తగ్గిపోతున్నది. దీంతో వేసిన పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. కొందరు రైతులు ఆశలు వదులుకొని పంటలను పశువులు, గొర్రెల మేతకు వదిలేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో గతేడాది 5.5 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా.. ప్రస్తుతం 6.53 మీటర్ల లోతుకు పడిపోయాయి. గతంలో బోర్లలో రెండు ఇంచులకుపైగా నీరు రాగా.. ప్రస్తుతం ఇంచు నీరు కూడా రాని పరిస్థితి నెలకొన్నది. గద్వాల మండలం లత్తీపురం శివారులో రైతుల బోర్ల నుంచి చిన్న నీటి ధారలు వస్తుండడంతో పొలాలు నెర్రెలు బారుతున్నాయి. వచ్చే అరకొర నీటితో వేసిన వరి పైరును కాపాడుకుంటున్నారు. కేటీదొడ్డి, గట్టు, ధరూర్‌తోపాటు గద్వాల మండలం గువ్వలదిన్నె, పెంచికలపాడు, చెన్నారెడ్డిపల్లి, జమ్మిచేడు గ్రామాల్లో రైతులు వరి, వేరుశనగ, మిరప పంటలు వేశారు. బోర్లు ఎండిపోవడంతో పంటలను వదిలేశారు. రైతులకు పెట్టుబడి కూడా రాక పోవడంతో దిగులు చెందుతున్నారు. ఈ తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు, రుణమాఫీ చేసి ఆదుకుంటుందని భావించిన రైతులకు నిరాశే ఎదురైంది.

### రైతులకు 'చేయి'చ్చింది



అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ఓట్లు వేసినందుకు మాకు తగిన శాస్తి జరిగింది. అధికారంలోకి వస్తే రైతుబంధు ఇస్తాం.. రుణమాఫీ చేస్తామని చెప్పి రైతుల ఓట్లు దండుకొని.. ఇప్పుడు రైతుబంధు, రుణమాఫీ చేయకుండా 'చేయి'చ్చింది. కేసీఆర్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎంత ఖర్చయినా భరించి పెట్టుబడి సాయం అందజేసింది. కాంగ్రెస్ పాలనలో మూడు ఎకరాలకే రైతుబంధు సాయం అందింది. నీళ్లలేక ప్రాజెక్టుల కింద అధికారులు క్రాప్‌హాలీడే ప్రకటించారు. బోర్ల కింద పంటలు సాగు చేస్తే కరెంట్ సరఫరా సక్రమంగా రావడం లేదు. నీటి కోసం నానా పాట్లు పడుతున్నాం. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ప్రస్తుతం జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి.

– సత్యారెడ్డి, రైతు, లత్తీపురం, గద్వాల జిల్లా



### నాడు కళకళ.. నేడు వెలవెల

కొల్లాపూర్, మార్చి 21 : కొల్లాపూర్ శివారులో మార్కెట్ యార్డుకు ఎదురుగా ఉన్న బావి నీరులేక వెలవెలబోతున్నది. గతేడాది ఇదే నెలలో కాల్వలు పారడంతో బావి జలకళను సంతరించుకున్నది. నేడు నీటి విడుదల నిలిచిపోవడంతో బావిలో నీళ్లు తగ్గి పొలాలన్నీ బీళ్లుగా మారాయి.



## కందూరు బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- నేడు పార్వతీ రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం
- జాతరకుఏరా ్పట్లు చేసిన నిర్వాహకులు

మూసాపేట(అడ్డాకుల), మార్చి 21 : దక్షణకాశీగా పేరుగాంచిన కందూరు రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భూతబలి, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, దీక్షాధారణ, అఖండస్థాపన, త్రిశూలపూజ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణం, బలిహరణ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం ఉదయం 10గంటలకు పార్వతీ, రామలింగేశ్వరస్వామి కల్యాణం ఉంటుందని, కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులకు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ఈవో రాజేశ్వరశర్మ, గ్రామ పెద్దలు కోరారు.

### జాతరకు ఏర్పాట్లు..

రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను చేసినట్లు ఆలయ ఈవో రాజేశ్వరశర్మ తెలిపారు. స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు క్యూలో నిలిచి ఉండడానికి నీడ, తాగునీటి వసతి తదితర ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



ఆలయంలో పూజలు చేస్తున్నవేద పండితులు

## చల్లంగా చూడమ్మా..జము లమ్మ

- కందూరులో కొనసాగుతున్న విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు
- బోనాలతోఊ రేగింపు

మూసాపేట(అడ్డాకుల), మార్చి 21 : పిల్లా, పాపలను, గొడ్డు, గోదను చల్లంగా చూడమ్మా.. జములమ్మ తల్లీ అంటూ అడ్డాకుల మండలంలోని కందూరు గ్రామస్తులు వేడుకున్నారు. కందూరు గ్రామంలో నాలుగు రోజులుగా జములమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం జములమ్మకు గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఇష్టమైన నైవేద్యాలను నూతన పాత్రలలో వండి బొట్లతో అలంకరించారు. అనంతరం భాజాభజంత్రీలు, డోలు, డప్పుల మోతల మధ్య బోనాలతో మహిళలు భారీ ఊరేగింపుగా బయలుదేరారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జములమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ ఉత్సవాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



కందూరులో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

## రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



రైతులతో మాట్లాడుతున్నమా జీ ఎమ్మెల్యే ఆల

- ఎకరాకు రూ.10 వేలు అందించాలి
- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
- దంతనూరులో ఎండిన కౌలు రైతుల వరి పొలాలు పరిశీలన

మదనాపురం, మార్చి 21 : సరైన సమయానికి వ్యవసాయానికి విద్యుత్, సాగునీరు ఇవ్వలేని చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల పక్షాన పోరాడుతామని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎకరాకూ రూ.10 వేల నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. దంతనూరుకు చెందిన గట్టన్న, పెద్ద చెన్నయ్యతోపాటు పలువురు రైతులు వరి సాగు చేయగా ఎండిపోవడంతో గురువారం మండల నాయకులతో కలిసి ఆల పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేస్తే రైతులు గోస పడుతున్నారని వాపోయారు. సొంత పొలంతో పాటు కౌలుకు తీసుకున్న పొలాల్లో రూ.వేలు ఖర్చుపెట్టి వరి పంట వేసుకున్న కర్షకులకు గోస తప్పడం లేదన్నారు. విద్యుత్, సాగునీరు లేక పంట పూర్తిగా ఎండిపోవడంతో గొర్రెలు, పశువులు మేయడానికి విడిచిపెట్టిన పరిస్థితి కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలో 2014 కంటే ముందు ఉన్న కరువు పరిస్థితిలు మళ్లీ పాలమూరు జిల్లాలో కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు చెప్పిన మార్పు అంటే ఇదేనేమో అని ఎద్దేవా చేశారు. రైతుల కడుపుకొట్టడానికి, వారిని నిండా ముంచడానికే రేవంత్ ప్రభుత్వం వచ్చినట్లు కనిపిస్తుందని ధ్వజమెత్తారు. రూ.10 వేల రైతుబంధు వద్దు డిసెంబర్ 9 తర్వాత రైతు భరోసాలో భాగంగా రూ.15 వేలు ఇస్తామన్న నేతలు ఇప్పుడెక్కడ ఉన్నారని నిలదీశారు. పాత రైతుబంధు డబ్బులే రైతులకు నేటికీ సక్రమంగా ఇవ్వడం లేదని కన్నెర్ర చేశారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మాట తప్పడంలో సిద్ధహస్తులు కాంగ్రెస్ నాయకులు, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను తుంగలో తొక్కారని దుయ్యబట్టారు. మిషన్ భగీరథ పథకాన్ని అటకెక్కించారని, దీంతో తాగునీటికి ప్రజలు పడుతున్న బాధలు వర్ణణాతీతమని చెప్పారు. నేడు రాష్ట్రాభివృద్ధిని మరిచి కేసీఆర్‌ను తిట్టడం, గత ప్రభుత్వంపై అభాండాలు మోపడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని విచారం వ్యక్తం చేశారు. కేసీఆర్ కన్న గొప్పగా ప్రజలకు సేవ చేయాలనే సోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ డిసెంబర్ 9 నాడు రైతులకు చేస్తామన్నా.. నేటికీ ఆ ఊసెత్తడం లేదన్నారు. వృద్ధాప్య పింఛన్ రూ.4 వేలు, ప్రతి మహిళకు రూ.2,500 ఇస్తామన్నా ఒక్కటీ అమలు చేయడం లేదని విమర్శించారు. అమలుకాని హామీలు ఇచ్చి అబద్ధాలు చెప్పి ఓట్లు దండుకొని, రాష్ట్ర ప్రజలను నిండా ముంచి చేతులెత్తేసి కూర్చున్నారని అన్నారు. ప్రజలు ఇప్పటికైనా వారి మాయమాటలను గుర్తించి కర్రుకాల్చి వాత పెట్టాలని సూచించారు. వచ్చే ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో ఆలోచించి ప్రజలు శ్రేయస్సుకోరే బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అసమర్థ పాలనతో నేడు గ్రామాల్లో మంచినీటి ఎద్దడి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు గట్టన్న మాట్లాడుతూ కరెంట్, సాగునీరు లేక రెండెకరాల్లో సాగైన పంట పూర్తిగా ఎండిపోయిందని, దీంతో మేకలకు వదిలేశానని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు డబ్బులు, పెట్టుబడి దాదాపుగా రూ.50 వేలు నష్టపోయానని అన్నారు. ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, బీఆర్‌ఎస్ దేవరకద్ర నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జయంతి, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ప్రశాంత్, మాజీ జెడ్పీటీసీలు విశ్వేశ్వర్, బాలమణెమ్మ, విండో వైస్ చైర్మన్ శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, నాయకులు బాలకృష్ణ, ప్రవీణ్‌రెడ్డి, తిరుపతయ్య, వెంకటేశ్, శ్రీనివాసులు, మాసన్న, రమేశ్, శివశంకర్, రవికుమార్, రాంచందర్ ఉన్నారు.

## ప్రజాక్షేత్రంలో బీఆర్‌ఎస్‌దే విజయం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- క్యాంపునకు బయలుదేరిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు

వనపర్తి, మార్చి 21 : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో తప్పక బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి విజయం సాధిస్తారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఉద్ఘాటించారు. గురువారం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో కలిసి మాజీ మంత్రి క్యాంపునకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నుంచి ఎన్నికైన ప్రతి ఎంపీటీసీ, జెడ్పీటీసీలు తప్పక బీఆర్‌ఎస్ పార్టీ బలపర్చిన స్థానిక సంస్థల అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తారని ప్రజాక్షేత్రంలో బీఆర్‌ఎస్‌దే విజయం అన్నారు. ఈ క్యాంపునకు కొంతమంది ప్రజాప్రతినిధులు తమ సొంత పనులు, అనారోగ్య సమస్యల వల్ల ప్రస్తుతం రాలేకపోతున్నారు. కానీ మరో రెండు రోజుల్లో వారు కూడా క్యాంపులో జాయిన్ కానున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీలోని ఏ ప్రజాప్రతినిధి అంసతృప్తిలో లేరని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నేతలు ఉన్నారు.

### ఆలయాల పనులు పరిశీలన

వనపర్తి జిల్లా కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా పునఃనిర్మాణం చేపట్టిన పలు ఆలయాల పనులను బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా ఆలయాలకు సంబంధించిన స్థలం కోల్పోవడం జరిగింది, అందులో భాగంగా ఆలయాల నిర్మాణాలకు తాను సొంతంగా రూ.5 లక్షలు ఇచ్చినట్లు చెప్పారు. వీరాంజనేయస్వామి, కాళీమాత ఆలయాల నిర్మాణానికి తనవంతు మరింత సహకారం అందిస్తానని, వీటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అంతకుముందు ఆయన కాళీమాత, వీరాంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు నీలస్వామి, ఎర్రశీను, బాలస్వామి, రామస్వామి, రవి తదితరులు ఉన్నారు.



వనపర్తి నుంచి క్యాంపునకుబ యలుదేరుతున్న ప్రజాప్రతినిధులతో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

## బియ్యం లారీ పట్టివేత

మాగనూరు, మార్చి 21 : బియ్యం లారీ పట్టుబడిన సంఘటన నారాయణపేట జిల్లాలో చోటు చేసుకున్నది. ఎస్సై మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ కథనం మేరకు.. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం సోలీపూర్ గ్రామంలోని ఓ రైస్ ఇండస్ట్రీ నుంచి కర్ణాటకలోని రాయిచూర్‌కు 150 క్వింటాళ్ల బియ్యంతో లారీ వెళ్తున్నదన్న సమాచారం పోలీసులకు అందింది. వెంటనే అప్రమత్తమైన వారు మాగనూరు పోలీస్‌స్టేషన్ ఎదురుగా బుధవారం రాత్రి వాహనాన్ని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. బియ్యంపై అనుమానం ఉండడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో గురువారం డీటీ కాలప్ప పరిశీలించారు. బియ్యం శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు తరలించారు. రిపోర్ట్ ఆధారంగా కేసు నమోదు చేస్తామని డీటీ తెలిపారు.



పట్టుకున్న బియ్యం లారీ వద్ద అధికారులు